కన్నెపెల్లి కార్యదర్శిని తొలగించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ - కౌటాల

విధులు సక్రమంగా నిర్వర్తించని కార్యదర్శిని తొలగించాలని కోరుతూ సర్పంచ్ మోర్లె రమేష్, గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యదర్శి ఇంట్లోనే ఉంటూ విధులు నిర్వహిస్తున్నట్టు ఫొటోలు పంపిస్తుందని, వారానికి రెండు రోజులు కూడా రావడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించడంలో తీవ్ర జాప్యం చేస్తుందన్నారు. నాగెపెల్లి గ్రామానికి చెందిన రైతు ఆవులారి బాపు ప్రభుత్వం నుండి మంజూరైన పశువుల పాకను అప్పుచేసి కట్టినప్పటికీ దానికి సంబంధించిన చెక్కు కోసం మూడు నెలల నుండి తిప్పించుకుంటూ ఇప్పటివరకు చెక్కు ఇవ్వడం లేదని, దీనిపై సంబంధిత అధికారులు స్పందించి రైతుకు పశువుల పాక డబ్బులు చెల్లించేలా చూడాలని కోరారు.

క్రీడాకారులకు వాలీబాల్ కిట్ పంపిణీ

నవతెలంగాణ - వాంకిడి

మండలంలోని కిర్డీ గ్రామంలో క్రీడాకారులకు ఎస్ఐ సాగర్ మంగళవారం వాలీబాల్ కిట్టు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సన్మార్గంలో ప్రయాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. యువత క్రీడల్లో రాణించి ఉన్నత చదువులు చదువుకోవాలని, రానున్న రోజుల్లో నోటిఫికేషన్‌లు వెలువడనున్నాయని, చక్కగా చదువుకొని ఉద్యోగాలు సాధించాలని యువకులను కోరారు. గ్రామంలో ఎవరైన అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్, సర్పంచ్ గంగారాం, యువకులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు కర్షకులు సన్నద్ధం..!

- 2023-24 ఏడాదిలో 5.66లక్షల ఎకరాల్లో పంటలు
- గతేడాది కంటే స్వల్పంగా పెరిగిన సాగు విస్తీర్ణం
- నకిలీ విత్తనాల బెడద అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్
- మార్కెట్‌లో అందుబాటులోకి విత్తనాలు, ఎరువులు
- ఖరీఫ్ ప్రణాళిక ఖరారు చేసిన వ్యవసాయశాఖ

జిల్లా వ్యవసాయశాఖ 2023-24 ఏడాదికి సంబంధించి ఖరీఫ్ ప్రణాళికను సిద్ధం చేసింది. ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది 5.66లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయనున్నట్లు ఆ శాఖ ప్రణాళిక రూపొందించింది. వీటికి అనుగుణంగా అధికారులు విత్తనాలు, ఎరువులను సర్దుబాటు చేస్తున్నారు. మరోపక్క ఈ ఏడాది వడగండ్ల వానలతో కడగండ్లు మిగిల్చిన విషాదం నుంచి కర్షకులు ఆశల సాగు వైపు పయనమవుతున్నారు.ఇప్పటికే వేసవి దుక్కులు పూర్తిచేసిన అన్నదాతలు రుతు పవనాలు రాగానే విత్తనాలు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే అనేక మంది రైతులు పత్తి, సోయా, కందులు తదితర విత్తనాలు కొనుగోలు చేయడంలో నిమ్నగమయ్యారు. విత్తన, ఎరువుల దుకాణాలు రైతులతో కళకళలాడుతున్నాయి. మరోపక్క మార్కెట్‌లోకి నకిలీ విత్తనాలు రాకుండా అధికారులు టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దింపారు. ఇప్పటికే ఆయా దుకాణాల్లో తనిఖీలు చేపట్టిన అధికారులు నకిలీలపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమయ్యారు. రైతులు లైసెన్సు కలిగిన డీలర్ల వద్ద నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని అధికారులు చెబుతున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఖరీఫ్ సాగుపై కోటి ఆశలతో కర్షకులు సన్నద్ధమవుతున్నారు. కిందటి సంవత్సరం ఖరీఫ్‌లో తీవ్ర నష్టాలను చవిచూసిన అన్నదాతలు రాబోవు కాలంపై గంపెడాశలు పెట్టుకున్నారు. సాధారణంగా ఒక ఏడాది నష్టాలు వస్తే..మరో ఏడాది కలిసి వస్తుందని అన్నదాతలు నమ్మకంతో ఉన్నారు. అతివృష్టి, ప్రకృతి వైపరీత్యాల కారణంగా కిందటేడాది పంటలు వర్షార్పణం కావడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. ఎకరానికి కేవలం 4 నుంచి 5క్వింటాళ్ల వరకు మాత్రమే దిగుబడి వచ్చింది. మరోపక్క మార్కెట్‌లోనూ గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్ర నష్టాలను చూవిచూడాల్సి వచ్చింది. రబీలో వేసిన పంటలు కూడా వడగండ్ల వర్షానికి దెబ్బతినడంతో ఏడాదంతా రైతులు నష్టాల్లోనే మునిగిపోయారు. తాజాగా రానున్న 2023-24 ఖరీఫ్ సీజన్‌పై భారీగా ఆశలు పెట్టుకున్నారు. కిందటేడాది మాదిరిగానే పత్తిని అధికంగా పండించేందుకు సిద్ధమయ్యారు. కిందటేడాది కంటే రానున్న ఖరీఫ్‌లో పత్తి పంట సుమారు 7 వేల ఎకరాల్లో అధికంగా వేయనున్నారు. సోయా, కందులు, ఇతర పంటలు కూడా గతేడాది కంటే అధికంగా వేయాలని భావిస్తున్నట్లు అధికారులు లెక్కలు వేశారు.

2023-24 ప్రణాళిక ఖరారు..!

రానున్న ఖరీఫ్ కాలానికి వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. జిల్లావ్యాప్తంగా 5.66లక్షల ఎకరాల విస్తీర్ణంలో పంటలు వేయనున్నారు. కిందటేడాది 5.50లక్షల ఎకరాల్లో సాగు కాగా.. ఈ ఏడాది మరో 16వేల ఎకరాల సాగు విస్తీర్ణం పెరిగింది. ఈ ఏడాది కూడా అధికంగా పత్తి 3.57లక్షల ఎకరాలు, సోయా 1.32లక్షల ఎకరాలు, కందులు 70వేల ఎకరాలతో పాటు మిగితా పంటలు సాగు చేయనున్నారు. ఇందుకు పత్తి 8.50లక్షల విత్తన పాకెట్లు, 40వేల క్వింటాళ్ల సోయా విత్తనాలు, మరో 5వేల క్వింటాళ్ల వరకు కందుల విత్తనాలు అవసరమని అధికారులు చెబుతున్నారు. మిగితా పంటలకు సంబంధించి విత్తనాలు కూడా అవసరం మేరకు అందుబాటులో ఉన్నట్లు పేర్కొంటున్నారు.



ఇందుకు 90వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా.. యూరియా 43వేల మెట్రిక్‌టన్నులు, డీఏపీ 18వేల మెట్రిక్‌టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 42వేలు, పొటాష్ 9వేలు, సూపర్ మరో 5వేల మెట్రిక్ టన్నుల అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం 50వేల మెట్రిక్ టన్నుల వరకు అందుబాటులో ఉన్నాయని.. మరో40వేల మెట్రిక్ టన్నుల వరకు ఎరువులు వస్తాయని అధికారులు చెబుతున్నారు. కిందటేడాది ఆయిల్‌ఫాం సాగు 3400 ఎకరాల్లో సాగు కాగా.. ఈ ఏడాది 5వేల ఎకరాల్లో ఆయిల్‌ఫాం సాగు అవుతుందని ప్రణాళిక రూపొందించారు. నకిలీ విత్తనాలు అరికట్టేందుకు ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటుచేశారు.

లైసెన్సు డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలి : పుల్లయ్య, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

రానున్న ఖరీఫ్ కాలానికి సంబంధించి పంటల వారీగా సాగయ్యే ప్రణాళిక ఖరారు చేశాం. రైతులు లైసెన్సు కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి. రసీదు తీసుకొని భద్రంగా దాచుకోవాలి. ఎందరు పట్టాదారులు ఉంటే అందరి పేరు మీద రసీదులు ఉండాలి. ముఖ్యంగా రైతులు సరైన వర్షపాతం ఉన్నప్పుడే విత్తనాలు వేయాలి. రైతు వేదికల్లో ప్రతి వారం రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతులు ఏమైన సలహాలు, సూచనల కోసం స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించాలి.

సీఐటీయూతోనే ఉద్యోగ, కార్మికుల హక్కులు సాధ్యం

- ఘనంగా సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-నిర్మల్

సీఐటీయూతోనే ఉద్యోగ, కార్మికుల హక్కులు సాధ్యమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జెండాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 1970 మే 30న ఆవిర్భవించి ఇప్పటికీ 53 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. కార్మికులను ఐక్యం చేసి, సంఘం నిర్మాణం చేసి, పోరాటాల దిశగా ముందుకెళుతూ ఉద్యోగ, కార్మికులహక్కుల కోసం నిర్విరామమైన పోరాటం చేస్తుందని అన్నారు. ఉద్యమాలతో అనేక కార్మిక సంఘాలు ఉద్యోగ భద్రత సాధించుకున్నాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సమ్మెలు, సదస్సులు, ర్యాలీలు చేస్తూ కార్మికుల హక్కులను సాధిస్తోందన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం 42 కేంద్ర కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్‌లుగా విభజించటం వల్ల కార్మిక వర్గం తీవ్ర అన్యాయానికి గురవుతోందన్నారు. కొత్తగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనాలు చట్ట ప్రకారం రూ.26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కులాలు, మతాల పేరుతో దేశంలో జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలని తెలిపారు. 137 సంవత్సరాల క్రితం సాధించుకున్న హక్కులను ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేస్తూ, 12 గంటల పని విధానాన్ని తీసుకొస్తున్న కేంద్ర ప్రభుత్వంపై కార్మిక చట్టాల సాధనకై నిరంతరం పోరాడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, అనుబంధ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఫారెస్టు అధికారుల దౌర్జన్యాలను అరికడతాం

- పాల్వాయి హరీష్‌బాబు



నవతెలంగాణ - కౌటాల

ఫారెస్టు అధికారుల దౌర్జన్యాలను అరికడతామని బీజేపీ నియోజకవర్గ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని శిర్షా గ్రామం నుండి పల్లెపల్లెకు పాల్వాయి గడపగడపకు బీజేపీ పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా ముందుగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో పర్యటించి గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 2014లో కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఫారెస్టు అధికారుల దౌర్జన్యాలు విపరీతంగా పెరిగాయని, పోడు రైతులను, గొల్ల కాపరులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే ప్రభుత్వం ఫారెస్టు అధికారుల దౌర్జన్యాలను అరికడుతుందన్నారు. పోడు రైతులకు, గొల్లకుర్మలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అక్కడి నుండి కన్కి గ్రామానికి పాదయాత్రగా బయలుదేరారు. ఆయన వెంట పార్టీ మండలాధ్యక్షుడు నరులె వానుపటేల్, ఎంపీటీసీ దుర్గం మోతిరాం, మాజీ జెడ్పీటీసీ ఎలుముల మల్లయ్య, బండి రాజేందర్‌గౌడ్, కుంచాల విజయ్, ఎలుములె మధూకర్, వసంత్, శివరాం, శంకర్ ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో చిన్నారి మృతి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

అప్పటి వరకు ఆటలు ఆడుకుంటూ సందడిగా గడిపిన ఆ చిన్నారి అప్పటికప్పుడే విగతజీవిగా మారడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. ఆడుకుంటూ వెళ్లిన ఆ చిన్నారి విద్యుత్ మోటారుకు ఉన్న ఇనుప పైపులైన్‌ను తాకి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన ప్రకారం.. స్థానిక సర్‌సిల్క్ కాలనీ విజయబస్తీకి చెందిన ఎండి సమీర్-సానియా సుల్తానాల కూతురు ఆశా సుల్తానా (14 నెలలు) మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో తన ఇంటి ఆవరణలో ఆడుకుంటోంది. సమీపంలోనే విద్యుత్ మోటారుకు బిగించి ఉన్న పైపులైన్ ఉంది. ఆ పైపులైన్‌కు విద్యుత్ సరఫరా అవుతుండడం, ఆ చిన్నారి ఆడుకుంటూ వెళ్లి ఆ పైపులైన్‌ను పట్టుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురైంది. చిన్నారి కేకలకు ఇంట్లో ఉన్న తాత నవాజ్‌హుస్సేన్ అక్కడికి వచ్చి చిన్నారిని లాగడంతో అతను కూడా షాక్‌కు గురై చెరో వైపు పడిపోయారు. వెంటనే కుటుంబసభ్యులు చిన్నారిని స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా తాత నవాజ్‌హుస్సేన్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. అప్పటి వరకు సందడిగా ఇంట్లో గడిపిన చిన్నారి మృత్యువాత పడడాన్ని ఆ కుటుంబసభ్యులు జీర్ణించుకోలేకపోయారు. భోరున రోదించారు. సంఘటనాస్థలాన్ని టౌన్ ఎస్ఐ చంద్రశేఖర్, ట్రాన్స్‌కో ఎఈ కమలాకర్ సందర్శించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

సీసీ రోడ్డు ప్రారంభం

వాంకిడి : మండల కేంద్రం నుండి కమాన గ్రామం వరకు రూ.4కోట్లతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించినట్టు కమాన సర్పంచ్ పెందూర్ పవన్ మంగళవారం తెలిపారు. కొన్ని సంవత్సరాల నుండి కమాన నుండి వివిధ గ్రామాలకు వెళ్లే ప్రజలు రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడంతో రోడ్డుపై కంకర తేలి, గుంతలు ఏర్పడి అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రోడ్డు పనులు పూర్తయితే ఐదు గ్రామ పంచాయతీల ప్రజలకు సౌకర్యం కలుగుతుందన్నారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి త్వరలోనే పనులు పూర్తి చేయాలని ఆయన పేర్కొన్నారు.

అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలి

- బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



నవతెలంగాణ - కౌటాల

అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని గుండాయిపేట్ గ్రామంలో బుద్ధవిహార్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై బుద్ధవిహార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలన్నారు. అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును డబ్బులకు అమ్ముకోవద్దని, నిజాయితీగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేదరికంలో పుట్టి, ఉన్నత చదువులు చదివి దేశ రాజ్యాంగ నిర్మాతగా ఎదిగాడని, అందరు ఆ విధంగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహిస్తున్న దశాబ్ధి ఉత్సవాలను వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రజానీకం ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాలు జరుపుతున్నారని విమర్శించారు. నియోజకవర్గం నుండే రాబోయే శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయాలని ఆయనను కోరగా ఈ విషయంపై బీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షురాలు మాయవతి దృష్టికి తీసుకెళ్లి ఆమె నిర్ణయం మేరకే నడుచుకోనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షాకాలం దృష్ట్యా ముందస్తు చర్యలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

వర్షాకాలం సమీపిస్తున్న దృష్ట్యా పారిశుధ్యంపై మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సాధించాలని మున్సిపల్ చైర్మన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మురికి కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా తీసుకోవాల్సిన చర్యలు, నిరంతర పారిశుధ్య పనులకు సంబంధించిన పనులను పర్యవేక్షించారు. పట్టణంలోని ద్వారకానగర్, భుక్తాపూర్, పంజాబ్‌చౌక్, మహాలక్ష్మివాడ, తాటిగూడ, పిట్టలవాడలో విస్తృతంగా పర్యటిస్తూ చేపడుతున్న పనుల తీరును పరిశీలించారు. క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు, సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. రానున్న వర్షాకాలంలో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. సమస్యాత్మక భారీ మురికి కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికపుడు పనులు చేపట్టాలన్నారు. వర్షాలు ప్రారంభం కాకముందే ముందస్తుగానే అప్రమత్తమై వివిధ పనులను చేపడుతున్నట్లు చైర్మన్ పేర్కొన్నారు. మురికి కాలువల్లో చెత్త వేయడం ద్వారా నీరు నిల్వ ఉండే ప్రమాదం ఉందని ప్రజలు మున్సిపల్ వాహనాల్లోనే చెత్త వేయాలని సూచించారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు అంటురోగాల బారిన పడకుండా ప్రతి ఒక్కరు తడి, పొడి చెత్త వంటి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. చైర్మన్ వెంట మున్సిపల్ ఎస్సై నరేందర్, కౌన్సిలర్ బండారి సతీష్, ఆకుల ప్రవీణ్, సలీం ఉన్నారు.

సిర్పూర్ వైపు ఆర్ఎస్‌పి చూపు

- అవుననే సంకేతాలు ఇస్తున్న బీఎస్‌పీ చీఫ్ ప్రవీణ్‌కుమార్
- తరచుగా నియోజకవర్గ పర్యటనకు కారణం ఇదేనా?

బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రానున్న ఎన్నికలలో సిర్పూరు (టి) నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్నారా? ఇపుడు నియోజకవర్గంలో ఇదే వార్త చర్చనీయాంశంగా మారుతోంది. దీనికి తగ్గట్లుగా ప్రవీణ్‌కుమార్ కూడా నియోజకవర్గంలో పోటీకి సుముఖంగానే ఉన్నట్లు సంకేతాలు ఇస్తుండడం అనుమానాలకు బలం చేకూరుస్తోంది. తరచు ఆయన నియోజకవర్గంలో పర్యటనలకు వస్తుండడం, అధికారపార్టీ ఆగడాలను విమర్శిస్తూ మాట్లాడడం బట్టి చూస్తే రాబోయే ఎన్నికలలో జనరల్ నియోజకవర్గమైన సిర్పూర్(టి) నుండి పోటీ చేయడం ఖాయమనే వార్తలు వినిపిస్తున్నాయి.



కాగజ్‌నగర్‌లో పాదయాత్ర చేపడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్(ఫైల్)

నవతెలంగాణ-కాగజ్‌నగర్

1995 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్. కరీంనగర్, అనంతపూర్ ఎస్పీలుగా, గ్రేహౌండ్స్ ఐజీగా, హైద్రాబాద్ డీసీపీగా, జాయింట్ సీపీగా బాధ్యతలు నిర్వర్తించారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యాలయాల సంస్థ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న సమయంలోనే తన ఉద్యోగానికి రాజీనామా చేసి 2021, ఆగష్టులో బహుజన సమాజ్ పార్టీలో చేరారు. ప్రస్తుతం బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులుగా కొనసాగుతున్న ఈయన సిర్పూరు (టి) నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. తరచుగా నియోజకవర్గ పర్యటనలకు వస్తుండడం, సభలలో పాల్గొంటుండడంతో ఇక్కడి బీఎస్పీ నేతలకు బలం చేకూరింది. ముఖ్యంగా ఈ నియోజకవర్గంపై ఆయనకు పట్టుంది. బెల్లంపల్లి అడిషనల్ ఎస్పీగా ప్రవీణ్‌కుమార్ విధులు నిర్వర్తించిన సమయంలో ఆయన ఈ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాల గురించి ఆయనకు పూర్తి అవగాహన ఉంది. ఇప్పటికే ఆయన ఈ నియోజకవర్గంలో పలుసార్లు పర్యటించగా, ఒకసారి నియోజకవర్గవ్యాప్తంగా పాదయాత్ర కూడా చేపట్టారు.

గతంలో బీఎస్పీ గెలిచిన సీటు సిర్పూర్(టి)

సిర్పూరు (టి) నియోజకవర్గంలో 2014లో బీఎస్పీ విజయం సాధించింది. అప్పట్లో కోనేరు కోనప్ప బీఎస్పీ నుండి పోటీ చేసి విజయం సాధించారు. గెలిచిన అనంతరం టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్)లో చేరారు. ఈ నియోజకవర్గంలో బీఎస్పీ పట్ల ప్రజలలో ఆదరణ ఉందని గమనించిన ఆయన ఈ సీటుపై కన్నేసినట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఈ నియోజకవర్గం మహారాష్ట్రకు సరిహద్దుగా ఉండడం, ఎస్సీ సామాజికవర్గం ఓట్లు అధికంగా ఉన్నాయి. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పార్టీ పగ్గాలు చేపట్టిన నాటి నుండి ఒక్క ఎస్సీ సామాజికవర్గమే కాకుండా బీసీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను కూడా ఒకేతాటిపైకి తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. నియోజకవర్గంలో అటు ప్రభుత్వంపై, ఇటు అధికారపార్టీ ఎమ్మెల్యేపై పూర్తి వ్యతిరేకత ఉండడం, అదే సమయంలో బీఎస్పీ పట్ల ప్రజలలో ఆదరణ ఉండడంతో ఇక్కడి నుండి పోటీ చేయాలనే ఆలోచనకు వచ్చినట్లు తెలుస్తోంది.

మాయావతి నిర్ణయం మేరకు నడుచుకుంటా : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

బీఎస్పీ అధినేత్రి మాయావతి ఎలా నిర్ణయిస్తే అలా నడుచుకుంటానని సోమవారం రాత్రి కౌటాల మండలం గుండాయిపేటలో నిర్వహించిన సభలో ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ ప్రాంత ప్రజలు తాను ఇక్కడినుండి పోటీ చేయాలని కోరుకుంటున్నారని, వీరి కోరికను మాయావతి దృష్టికి తీసుకువెళ్లిన తర్వాత ఆమె నిర్ణయం మేరకు తాను ముందుకు వెళతానని ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు.

రామగుండం ఎమ్మెల్యేను కలిసిన దుర్గం శేఖర్



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

నేతకాని మహార్ సంఘం జిల్లా అధ్యక్షులు దుర్గం శేఖర్ మంగళవారం రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రామగుండంలో జరిగిన ఓ శుభకార్యానికి వెళ్లిన ఆయన బిఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు, స్థానిక ఎమ్మెల్యేను కలిసి పలు అంశాలపై చర్చించారు. ఇటీవల పట్టణంలో జరిపిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ వేడుకలతో పాటు నూతనగా నేతకాని మహార్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైనట్లు వివరించారు. దశాబ్దాల పాటు దుర్గం ట్రస్ట్ ద్వార చేపడుతున్న సేవా కార్యక్రమాలను సైతం ఎమ్మెల్యేకు వివరించారు. సామాజిక కార్యక్రమాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న దుర్గం శేఖర్‌ను ఎమ్మెల్యే అభినందించారు. పేదలకు అండగా నిలుస్తూ ట్రస్ట్ తరపున చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని చేపట్టాలని ఆకాంక్షించారు.

కిర్డీ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం

నవతెలంగాణ - వాంకిడి

మండలంలోని కిర్డీ గ్రామంలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రెహీమొద్దీన్, ఎస్ఐ సాగర్ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. హక్కులను ఎలా వినియోగించుకోవాలి, దళిత భూముల సమస్యలుంటే రెవెన్యూ అధికారులను కలిసి పరిష్కరించుకోవాలని, ప్రతి దళిత బిడ్డ చదువుకోవాలని, చదువుతోనే సమాజంలో గొప్ప స్థానాల్లో ఉండవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
2
బుధవారం 31 మే 2023

వరల్డ్ విజన్ సేవలు అమూల్యం

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండలంలోని రైతు వేదికలో మంగళవారం వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పోషకార లోపంతో బాధపడుతున్న పేదలకు, గర్భిణీ స్త్రీలకు న్యూట్రిషన్ కిట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి డీసీసీబీ వైస్ చైర్మెన్ రఘునందన్‌రెడ్డి, ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ హాజరయ్యారు. వరల్డ్ విజన్ సంస్థ సేవలు అమూల్యమైనవని డీసీసీబీ వైస్ చైర్మెన్ రఘునందన్‌రెడ్డి కొనియాడారు. నిరుపేదల అభ్యున్నతికి వరల్డ్ విజన్ సంస్థ మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ విజన్ సంస్థ ప్రతినిధి బ్రహ్మన్న, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

నవతెలంగాణ-నార్నూర్



పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని విజయనగర్ కాలనీలో సిబ్బందితో కలిసి డయేరియా పక్షోత్సవాల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఓఆర్ఎస్ ద్రావణం తయారు చేసి చూపించారు. 0 నుండి 5 సంవత్సరాలలోపు పిల్లలకు ఓఆర్ఎస్ జింక్ టాబ్లెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సిడాం జంగుబాయి, అంగన్‌వాడీ టీచర్ ఆడే సంగీత, ఆశాలు ఆడే జ్యోతి ఉన్నారు.

రసాభాసగా.. జెడ్పీ సర్వసభ్య సమావేశం

- సమస్యలు పట్టించుకోవడం లేదని జెడ్పీటీసీల నిరసన
- తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి
- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

జిల్లాకేంద్రంలోని దివ్యగార్డెన్‌లో మంగళవారం జెడ్పీచైర్‌పర్సన్ కొరిపెల్లి విజయలక్ష్మీ అధ్యక్షతన జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం రసాభాసగా కొనసాగింది. ఈ సమావేశానికి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. కాగా, వ్యవసాయ శాఖలో ఏఓ, ఏఈఓలు ఉన్నప్పటికీ పంట నష్టాలపై సర్వే చేయడం లేదని పలువురు జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు విమర్శించారు. నివేదికలు కూడా సరిగ్గా అందించడం లేదని అన్నారు. అతివృష్టి, అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు పరిహారం సైతం అందడం లేదన్నారు. జిల్లాలో నకిలీ విత్తనాల విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని, శాఖపరమైన చర్యలు శూన్యమని విమర్శించారు. నకిలీ విత్తనాల విక్రయాలు జరగకుండా అడ్డుకట్ట వేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమ, తరుగు పేరుతో దోపిడీ జరుగుతుందని, రైతులు మోసపోతున్నారని విమర్శించారు. రైస్‌మిల్లర్ల వద్ద లారీలు బారులు తీరుతున్నాయని అన్నారు. హమాలీ కొరత పేరుతో రైస్‌మిల్లర్లు ధాన్యాన్ని సేకరించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలకు సొంతభవనాలు లేవని, ఉన్న భవనాలు సైతం శిథిలావస్థలో ఉన్నాయని నూతనంగా అంగన్‌వాడీ భవనాలు నిర్మించాలని అన్నారు.

నిరసన తెలిపిన జెడ్పీటీసీలు..

తమ సమస్యలు పట్టించుకోవడం లేదని, సభాదృష్టికి తీసుకెళ్తే మైక్‌ను ఇవ్వడం లేదని విమర్శించారు. సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి నేరుగా సభావేదిక సమీపానికి వచ్చి మైక్ ఎందుకు ఇవ్వడం లేదని, తమ సమస్యలను పట్టించుకోవాలని ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని అన్నారు. అలాగే పెంబి జెడ్పీటీసీ జానుబాయి తమ సమస్యలు చెప్పుకోవడానికి మైక్ ఇవ్వడం లేదని సభావేదిక ముందు కింద కూచుని నిరసన తెలిపింది. దీంతో మంత్రి, కలెక్టర్‌లు జోక్యం చేసుకుని అందరికీ అవకాశం ఇస్తామని, తమతమ స్థానాల్లో ఉండి మాట్లాడాలని నచ్చజెప్పారు. దీంతో జెడ్పీటీసీ జానుబాయి మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన పెంబి మండలంలో అనేక సమస్యలు నెలకొన్నాయని అన్నారు. సంక్షేమ పథకాలు అందడం లేదని అన్నారు. దీంతో ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ జోక్యం చేసుకుని ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయని జిల్లా అభివృద్ధి పథంలో నడుస్తుందని, అసత్య ఆరోపణలు చేయవద్దని అన్నారు. దీంతో వీరిద్దరి మధ్య వాగ్వాదం నెలకొంది. కాగా, మంత్రి జోక్యం చేసుకుని ఇద్దరికి నచ్చజెప్పారు.

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి...

తెలంగాణ ఆవిర్భవించి పదో ఏటా అడుగుపెడుతుందని, ఈ దశాబ్ది వేడుకలను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. 21రోజులు జరిగే ఈ ఆవిర్భావ ఉత్సవాలను ఆయా శాఖలకు కేటాయించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈనెల 4న నూతన కలెక్టరేట్ సమీకృత భవనాన్ని ప్రారంభించేందుకు సీఎం కేసీఆర్ వస్తున్నారని తెలిపారు. అలాగే మెడికల్ కాలేజీ, మైనార్టీ రెసిడెన్షియల్ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, జిల్లా అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. అంతకుముందు పదోతరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానం రావడంతో డీఈఓ రవీందర్‌రెడ్డిని సన్మానించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, రేఖానాయక్, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ సుధీర్, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమస్యలు చెప్పేందుకు మైకు ఇవ్వడం లేదని వేదిక ఎదుట నిరసన తెలుపుతున్న సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి



సమస్యలు చెప్పేందుకు మైకు ఇవ్వడం లేదని సభా వేదిక ఎదుట కూర్చున్న పెంబి జెడ్పీటీసీ జానుబాయి

సీఎం కేసీఆర్ సభను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగే సీఎం కేసీఆర్ భారీ బహిరంగసభ విజయవంతం చేయాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని దివ్యా గార్డెన్‌లో నిర్మల్ నియోజకవర్గస్థాయి ముఖ్యకార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. జూన్ 4న నిర్మల్ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం, పార్టీ జిల్లా కార్యాలయాన్ని సీఎం ప్రారంభిస్తారని అన్నారు. అనంతరం బహిరంగ సభ ఉంటుందని అన్నారు. సభకు పెద్దఎత్తున బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని అన్నారు. సీఎం కేసీఆర్ చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను దృష్టిలో ఉంచుకొని ఆయనపై అభిమానంతో ప్రజలు భారీగా సమావేశానికి హాజరుకావాలని కోరారు. అన్ని గ్రామాల నుంచి ప్రజలను సభకు తీసుకొచ్చేందుకు ప్రణాళికను సిద్ధం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, మున్సిపల్ చైర్మెన్ గంఢ్రత్ ఈశ్వర్, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, నాయకులు నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, అల్లోల మురళీధర్‌రెడ్డి, రాంకిషన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యారోగ్య శాఖలో 32 మంది క్రమబద్ధీకరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న 32 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసినందుకు గానూ మంగళవారం వైద్య ప్రజారోగ్య ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో కృతజ్ఞత సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ ఉద్యోగులకు సర్వీస్ రెగ్యులర్ పత్రాలను డీఎంహెచ్‌ఓ నరేందర్ రాథోడ్‌తో కలిసి అందజేశారు. ఈ మేరకు మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ మేరకు సీఎం కేసీఆర్ కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరిస్తూ వారి కలలు సాకారం చేశారని అన్నారు. తమ ప్రభుత్వం ఉద్యోగులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఐఓ వైసీ శ్రీనివాస్, డీఎంఓ శ్రీధర్, వైద్య ప్రజారోగ్య ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారి కృష్ణ, దుర్గం ట్రస్ట్ చైర్మెన్ దుర్గం శేఖర్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలో అన్నాభావు సాటే యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను స్థానిక సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, ప్యాక్స్ ఇన్‌చార్జీ చైర్మెన్ సురేష్ ఆడే ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వం పెంపొందుతుందని అన్నారు. క్రీడాకారులు ఎండ వేడిని దృష్టిలో పెట్టుకొని తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్ దుర్గె కాంతారావ్, బీఆర్ఎస్ నాయకులు కోర్రల మహేందర్, ప్రతాప్, రాథోడ్ భిక్షపతి, రాజు, వసంత్, సుభాష్, యూత్ ప్రెసిడెంట్ సాయి, సుభాష్, తోగరే కిషోర్, రాథోడ్ శివాజీ, అజిం ఉన్నారు.

నేడు దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

నేడు మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఐఏయూవైఎస్ఏ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్



నవతెలంగాణ-నిర్మల్

11వ వార్షికోత్సవ సందర్భంగా అంతర్జాతీయ యువ సామాజిక స్వచ్ఛంద సేవా సంస్థ (ఇంటర్నేషనల్ ఓమౌజయ యునైటెడ్ యంగ్ స్టార్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో నిర్మల్ పట్టణంతో పాటు వివిధ మండలాల్లో యువతకోసం ప్రత్యేకంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న టోర్నీనికి మంగళవారం మున్సిపల్ చైర్మెన్ గంఢ్రత్ ఈశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరై టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సంస్థ ద్వారా ఈ క్రీడాలు నిర్వహించడం చాలా హర్షణీయమని కొనియాడారు. యువత కొరకు నిరంతర సేవలు అందిస్తున్న ఐఏయూవైఎస్ఏ వారి కృషిని అభినందించారు. మున్ముందుల చేసే సేవల్లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కృషితో సహాయ సహకారాలు అందిస్తామని హామి ఇచ్చారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు తిరుమల ఋషి, వర్కింగ్ ప్రెసిడెంట్ పురుషోత్తం, నిర్మల్ ఇన్‌చార్జి పురుషోత్తం, కృష్ణ, హుస్సేన్ బాషా, నర్సయ్య, రత్నాకర్, శ్రీనివాస్, నరేష్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై రైతుల ధర్నా

- సెంటర్ నిర్వాహకుల తీరుపై రైతుల ఆగ్రహం
- గంటపాటు వాహనాల రాకపోకలకు అంతరాయం



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ధాన్యం కొనుగోళ్లలో తీవ్రజాప్యం చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ఖానాపూర్ పట్టణంలో రైతులు రోడ్డెక్కారు. గంటపాటు రహదారిపై బైటాయించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక పీఏసీఎస్ అధికారులు చైర్మెన్ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయొద్దని ఇటీవల కలెక్టర్ వచ్చి ఆదేశించినా స్థానిక సెంటర్ నిర్వాహకులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. సంచుల కొరత పేరుతో దళారుల ద్వారా డబ్బులు ఇచ్చిన వారికి గన్నీ సంచులు ఇస్తున్నారని ఆరోపించారు. అదనంగా హమాలీలు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నా కమీషన్లకోసం పరిమిత హమాలీలతోనే తూకం చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సొసైటీ చైర్మెన్ అనుసరిస్తున్న తీరుపై రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఎస్సై శంకర్ అక్కడికి చేరుకొని శాంతపరిచారు. హమాలీల సంఖ్యను పెంచి ధాన్యం తూకాలను సకాలంలో జరిపించాలని సీఈఓ ఆశన్నకు సూచించారు. రైతుల ధర్నాకు కాంగ్రెస్ నాయకులు దయానంద్, చిన్నం సత్యం, జహీర్, బీజేపీ నాయకులు నాయిని సంతోష్, బుచ్చన్న యాదవ్, మామిడాల సుధాకర్ మద్దతు తెలిపారు.

రేణుక సిమెంట్ ఫ్యాక్టరీపై ఎమ్మెల్యే స్పందించాలి

- ఉద్యమాన్ని నీరుగార్చాలని చూస్తే ఊరుకోం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రేణుకా సిమెంట్స్ నిర్వాసితుల ఉద్యమాన్ని నీరుగార్చాలని చూస్తే ఊరుకోమని ఈ ఫ్యాక్టరీ గురించి ఎమ్మెల్యే జోగురామన్న స్పందించాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.. రేణుకా సిమెంట్స్ భూనిర్వాసితుల ఉద్యమాన్ని పక్క దారి పట్టించాలని చూస్తున్నారని ఆరోపించారు. భూనిర్వాసితుల కోసం న్యాయంగా పోరాటం చేస్తుంటే అక్రమ కేసులతో జోగు రామన్న భయపెట్టాలని చూస్తున్నారని అన్నారు. జోగు రామన్నకి మేలు చేసేలా ఎవరు ఉద్యమం చేస్తున్నారో, జోగు రామన్న వైఫల్యాల మీద ఎవరో పోరాడుతున్నారు. అనే విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అలాగే కొంత మంది రైతులను పక్కదారి పట్టించే విధంగా ప్రయత్నిస్తున్నారని, కావాలనే ఉద్యమం ముసుగులో గొడవలు సృష్టించాలని చూస్తున్నారని అన్నారు. ఇలాంటి పనులు మానుకోవాలని, ఉద్యమం చేస్తే రైతులకు లాభం చేకూరేలా ఉండాలి కానీ నష్టం చేయకూడదని స్పష్టం చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించకుండా తన అనుచరులతో మీడియా సమావేశం ఏర్పాటు చేసి రేణుక సిమెంట్ ఫ్యాక్టరీకి ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేదని చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. భూ నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పార్టీకి, ఎలక్షన్‌లకు అతీతంగా పోరాటం చేస్తామని, ఆమె స్పష్టం చేశారు. సమావేశంలో భూనిర్వాసితులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నవతెలంగాణ-దిలావర్‌పూర్



రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం నిర్మల్-భైంసా జాతీయ రహదారి దిలావర్‌పూర్ గ్రామ సమీపంలోని నూతనంగా నిర్మిస్తున్న పెట్రోల్ బంకు వద్ద చోటు చేసుకుంది. ఎస్సై గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గుండంపల్లి గ్రామానికి చెందిన గైని గణేష్(18) యువకుడు తన మొబైల్ ఫోన్ బాగు చేయించుకోవడానికి మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో గ్రామం నుండి నిర్మల్ వైపుకు (టీఎస్ 18 ఈ 5944) ద్విచక్ర వాహనంపై బయలుదేరి వెళ్లాడు. దిలావర్‌పూర్ పెట్రోల్ బంక్ సమీపంలోకి చేరుకోగానే మృతుని ముందు వెళ్తున్న ఆటో(టీఎస్ 18 టి 2553) నడుపుతున్న నవీన్ తన ఆటోను ఎటువంటి ఇండికేటర్ ఇవ్వకుండా అకస్మాత్తుగా కుడివైపుకి తిప్పడంతో ఆటో ముందు భాగానికి మృతుని వాహనం ఢీకొట్టగా ఆటో గాజు ముక్క మృతుని మెడను కోయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

జీలుగ విత్తనాలు పంపిణీ



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలకేంద్రంలోని రైతువేదికలో మంగళవారం డీసీసీబీ వైస్ చైర్మెన్ రఘునందన్‌రెడ్డి, ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్ రైతులకు సబ్సిడీ జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. రైతులు పంట పొలాల్లో జీలుగు వేయడంతో భూసారం పెరిగి దిగుబడి పెరుగుతుందని మండల ఏఈఓ ప్రవీణ్ కుమార్ అన్నారు. ప్రతీ రైతుకు సబ్సిడీ జీలుగ విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో చామన్‌పల్లి సర్పంచ్ గంగాధర్, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆయా శాఖలలో పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివరాం ప్రసాద్ సూచించారు. మంగళవారం జిల్లా కోర్టు సమావేశ మందిరంలో మంగళవారం ఆర్టీసీ, కార్మిక శాఖ, భీమా, బ్యాంకు అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నగేష్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు మద్దతు తెలిపిన సాజిద్‌ఖాన్

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం వారికి ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగుల కోసం పట్టణంలో నూతనంగా కాలనీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు ఇమ్రాన్ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
3
బుధవారం 31 మే 2023

బేడ బుడగ జంగాల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-జన్నారం

బేడ బుడగ జంగాల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వాన రాశి సమ్మయ్య అన్నారు. మంగళవారం మండలంలోని పొన్కల్ గ్రామపంచాయతీ పరిధిలోని బుడగ జంగాల కాలనీలో సంఘ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బుడగ జంగాలకు ప్రభుత్వం సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో వారు సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా వెనుకబడి పోతున్నారన్నారు. బుడగ జంగాలను ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలన్నారు. సంఘం బలోపేతం చేయడానికి బేడ బుడగ జంగాలు కలిసి రావాలని కోరారు. అనంతరం మండల బేడ బుడగ జంగాల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గడ్డం రవి, ఈ ర్నాల గంగన్న, చింతల రాజేందర్, మోతె సత్తయ్య, చిన్నమల్లు చింతల రాజు శంకర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

జానపద పాట చిత్రీకరణ ప్రారంభోత్సవం

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన యువతీ, యువకుల ఆధ్వర్యంలో జానపద పాట చిత్రీకరణ ప్రారంభోత్సవాన్ని మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు జాడి గంగాధర్ ప్రారంభించారు. మంగళవారం మండలంలోని తపాలాపూర్ గ్రామంలో ఉన్న శివాలయంలో పాట చిత్రీకరణను ప్రారంభించి చిత్రీకరించారు. ఈ పాటను ఆగం ఆగం యూట్యూబ్ ఛానల్ వారి ఆధ్వర్యంలో చిత్రీకరించనున్నరు. ఈ జానపద పాట మంచి విజయాన్ని సాధించాలని సర్పంచ్ కోరారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేయాలి

- ఎమ్మెల్సీ దండే విఠల్



నవతెలంగాణ-దండేపల్లి

ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. మంగళవారం మండలంలోని ముత్యంపేటలో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి కార్యకర్త తనవంతుగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని అంతర్గత విభేదాలతో పార్టీకి నష్టం కలిగించవద్దని ఆయన అన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ గులాబీ జెండా ఎగరడం ఖాయమని బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాల మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. నిరంతర అభివృద్ధి జరగాలంటే మళ్లీ బీఆర్ఎస్‌ను గెలిపించాలని, అందుకు పార్టీ కార్యకర్తలు కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే దివాకర్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-జన్నారం

మండలానికి చెందిన బానయ్య పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను సకాలంలో గుర్తించి మండల పోలీసులు తిరిగి అప్పగించారు. స్థానిక ఎస్సై సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బానయ్య ఇటీవల సెల్ ఫోన్ పోగొట్టుకున్నాడని, సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ఫోన్‌ను గుర్తించి మంగళవారం తిరిగి అప్పగించామన్నారు. కార్యక్రమంలో స్టేషన్ రైటర్ సురేష్, టెక్ టీం కానిస్టేబుల్ రవి, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థాల వినియోగంపై అవగాహన



నవతెలంగాణ-రెబ్బెన

జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గోలేటిలో వ్యర్థాల నిర్వహణ అంశంపై డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్ బెహార ఉద్యోగులకు అవగాహన కల్పించారు. వ్యర్థాలను పునర్ వినియోగించడం వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గుతుందన్నారు. పేపర్ వినియోగం కూడా పొదుపుగా చేసుకోవాలని, ఒకవైపు కాకుండా రెండువైపుల వినియోగించుకోవాలని ఆయన సూచించారు. వ్యర్థాలను బయోగ్యాస్ తయారీకి వినియోగిస్తేనే బహుళ ప్రయోజనాలు ఉంటాయని వెల్లడించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జూనియర్ ఫారెస్ట్ అసిస్టెంట్ ఆర్ నవీన్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ రమ్యకృష్ణ పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో పర్యటించిన డైరెక్టర్ బలరాం

- వైద్య పరీక్షలు మెరుగుపడాలని ఆదేశం



నవతెలంగాణ-రెబ్బెన

మంగళవారం గోలేటి ఏరియాలో పర్యటించిన డైరెక్టర్ బలరాం జీఎం దేవేందర్‌తో బెల్లంపల్లి ఏరియాలో పర్యటించారు. బెల్లంపల్లి ఏరియాలోని ఏరియా ఆస్పత్రి, తిలక్‌మైదానం, గోలేటిలోని భీమన్న క్రీడా మైదానాలను ఆయన పరిశీలించారు. ఏరియా ఆస్పత్రిలో రోగులతో ఆయన మాట్లాడారు. వైద్యమందుతున్న తీరుపై ఆయన ఆరా తీశారు. ఆస్పత్రి ఉద్యోగులు సమయపాలన పాటించాలని, వైద్యం కోసం వచ్చిన వారితో ఆప్యాయంగా మాట్లాడి సేవలందించాలని వైద్యులకు, సిబ్బందికి ఆదేశించారు. క్యాంటీన్ నిర్వహణ బాగుండాలని సూచించారు. జూన్ రెండున తెలంగాణ రాష్ట్రం అవతరణ దశాబ్ది ఉత్సవాలను జూన్ 5న సింగరేణి సంబరాలు ఘనంగా నిర్వహించాలన్నారు. గోలేటి భీమన్న మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. సింగరేణి సాధించిన ప్రగతి సేవలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం కొహెచ్ఎస్ గుప్తా, డీజీఎం సివిల్ ఆర్ సతీష్‌బాబు, పర్సనల్ మేనేజర్ ఐ లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

దశాబ్ధి ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ-బెజ్జూర్

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ శ్రీపాల్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని రైతువేదికలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల రెండో తేదీ నుండి తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు 22వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మాధవి, ఎంపీఓ రమేష్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కార్మిక, కర్షకుల

సమస్యల పరిష్కారానికి పోరాటమే శరణ్యం

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్
- ఘనంగా 53వ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కార్మిక కర్షకుల సమస్యల పట్ల పోరాడడమే తమ లక్ష్యమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ పునరుద్ఘాటించారు. సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1970లో సీఐటీయూ ఆవిర్భవించిందని అప్పటి నుంచి గత 53 సంవత్సరాలుగా వివిధ సమస్యలపై పోరాటం చేసినట్లు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సమ్మెలు, సదస్సులు ర్యాలీలు చేస్తూ కార్మికుల హక్కులను సాధించుకున్నదని గుర్తు చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం 42 కేంద్ర కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కోడులుగా విభజించటంవల్ల కార్మిక వర్గం తీవ్ర అన్యాయానికి గురవుతుందని అన్నారు. కొత్తగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలని కనీస వేతనాలు చట్ట ప్రకారం రూ.26000 అమలు చేయాలని కులమతాల పేరుతో దేశంలో జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. 137 సంవత్సరాల క్రితం సాధించుకున్న హక్కులను ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేస్తూ 12 గంటల పని విధానాన్ని తీసుకొస్తున్న కేంద్ర ప్రభుత్వంపై కార్మిక చట్టాల సాధనకై నిరంతరం పోరాడుతున్నదని అన్నారు. గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులు కొంతమేరకు హక్కులు సాధించారంటే అది తమ పోరాటాల ఫలితమేనన్నారు. బీజేపీ ప్రభుత్వం 9 సంవత్సరాల అధికార కాలంలో సరళీకృత ఆర్థిక విధానాలు ముందుకు తీసుకువచ్చి కార్మిక హక్కులను కాలరాసే విధంగా యాజమాన్లకు, పెట్టుబడుదారులకు, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను తిరగదోడి, అదానీ, అంబానీ పెట్టుబడిదారు లాభాల కోసం కార్మికుల పొట్టలు కొట్టే విధంగా మోడీ ప్రభుత్వం ప్రయత్నం చేసిందన్నారు. కార్మిక ఐక్యతను పక్కదారి పట్టించే విధంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ తీవ్రంగా ప్రయత్నం చేస్తుందన్నారు. మతాన్ని రాజకీయ స్వార్థం కోసం దుర్వినియోగం చేస్తూ కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకుండా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ మతోన్మాద విధానాలను ఎండగడుతూ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాజేందర్, నాయకులు సుధాకర్, తిరుపతి, స్వరూప, లక్ష్మి పాల్గొన్నారు.

భీమిని : సీఐటీయూ 53వ ఆవిర్భావవేడుకలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఘనంగా నిర్వహించారు. తాండూర్ ఐబిలో సీఐటీయూ మండల సహాయ కార్యదర్శి విజయలక్ష్మి సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం మాట్లాడుతూ 1970లో ఆవిర్భవించిన సీఐటీయూ తన 53 సంవత్సరాల కాలంలో స్వాతంత్ర ఐక్య పోరాటాలు చేసిందని తెలిపారు. కార్మిక వర్గ ఐక్యతను సీఐటీయూ విశిష్టతను తెలియజేశారు. మండల ఉపాధ్యక్షుడు దిగంబర్ మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అసంఘటిత, సంఘటిత, అవుట్సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులందరికీ కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ తగ్గిస్తూ నిరుపేదల ఉపాధి హామీచట్టాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గం నాన్నయ్య, వేల్పుల శంకర్ బొల్లం రాజేశం, తాజ్‌బాబ, భాగ్య, అంజలి పాల్గొన్నారు.

4న ప్రజా గర్జనను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

జూన్ 4 ఆదివారం చలో కొత్తగూడెం ప్రజా గర్జన సభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకలదాసు పిలుపునిచ్చారు. మంగళవారం హమాలీ యూనియన్ కార్యాలయం నస్పూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజా గర్జనలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని, రావాలనుకునే వారికి జూన్ 4 ఉదయం 8 గంటలకు మంచిర్యాల రైల్వే స్టేషన్ నుంచి సీపీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక రైలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొత్తగూడెంలో నిర్వహించే ఈ ప్రజా గర్జన సభ దేశంలో మతతత్వ రాజకీయాలని ఓడించడం కోసం దేశంలో మతాల మధ్య కులాల మధ్య చిచ్చు రేపుతున్న ఆర్ఎస్ఎస్, బీజేపీ దొంగ రాజకీయాలకు స్వస్తి పలకాలని సీపీఐ ప్రజలకు పిలుపునిస్తోందన్నారు. ఇప్పుడున్న రోజుల్లో దేశంలో ప్రజలకు పూర్తిగా అబద్ధపు విష ప్రచారాన్ని నింపుతూ దేశభక్తి అంటే 75 సంవత్సరాల స్వాతంత్ర వజ్రోత్సవాల సందర్భంగా బల్క్ ఇస్ భాను కుటుంబ సభ్యులను హత్య, అత్యాచారం చేసిన 15 మంది నిందితుల్ని క్షమాభిక్ష పేరుతో వదిలేయడమేనా బీజేపీ దేశభక్తి అని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటుపరిచేయడమేనా దేశభక్తి అని, రైతులకు రుణమాఫీలు చేయకుండా కార్పొరేట్ సంస్థలకు రూ.లక్షల కోట్లు మాఫీ చేయడమేనా దేశభక్తి ఈ అబద్ధపు గొబెల్స్ ప్రచారం తోటి దేశాన్ని ఏలుతున్న బీజేపీ దొంగ రాజకీయాల్ని ప్రజల్లో క్షేత్రస్థాయిలో ప్రచారం చేయడానికి, బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకట్ట వేసేందుకు ఈ ప్రజాగర్జన తోడ్పడుతుందని ఆశిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఉద్యమ సమయంలో, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా గర్జనను విజయవంతం చేయాలని అన్ని వర్గాల ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మహేష్, ఎం.రాజన్న, శ్రీనివాస్‌రెడ్డి, తోట శ్రీనివాస్, లచ్చన్న, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేసీఆర్ బహిరంగ సభకు భారీగా తరలిరావాలి



నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల సమీకృత కలెక్టరేట్ భవన ప్రారంభోత్సవానికి జూన్ 9న వస్తున్న సందర్భంగా ఏర్పాటు చేస్తున్న సీఎం కేసీఆర్ బహిరంగ సభకు భారీగా తరలిరావాలని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పిలుపునిచ్చారు. శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే-7 గనిపై మంగళవారం ఫిట్ సెక్రెటరీ మేండే వెంకటి ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. సింగరేణి కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇప్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్, జాతీయ కార్మిక సంఘాలు ఎన్ని అడ్డుపుల్లలు వేసినా చట్టపరిధిలో నిర్ణయం తీసుకొని కారుణ్య నియామకాల ద్వారా కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు కల్పిస్తున్నారని గుర్తు చేశారు. నేడు 16 వేల మంది యువకులకు ఉద్యోగాలు లభించాయన్నారు. తెలంగాణ రాకుంటే సింగరేణి ప్రాంత యువకులు అధోగతి పాలయ్యేవారన్నారు. సీఎం కేసీఆర్ సింగరేణి గనులు ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటున్నారని చెప్పారు. జాతీయ కార్మిక సంఘాలు సింగరేణి కార్మికులకు చేసిందేమీ లేదన్నారు. 10వ వేతనం 20 శాతం పెరిగితే, 11వ వేతనం 19 శాతం పెంచారని చెప్పారు. అన్ని అలవెన్స్‌లకు ఫ్రీజింగ్ చేశారని ఆరోపించారు. పెన్షన్ పెరుగుదలపై కనీసం జాతీయ సంఘాలు మాట్లాడకుండా మౌనం పాటిస్తుందని ఆరోపించారు. సీఎం బహిరంగ సభకు ప్రజలు సమ్మక్క, సారలమ్మ జాతరను తలపించేలా తరలివచ్చి కుంభమేళాలా జరుపుకోవాలని కోరారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షులు దీకొండ అన్నయ్య, మంద మల్లారెడ్డి, ఏరియా చర్చల ప్రతినిధి వెంగళ కుమారస్వామి, ఆర్కే-7 గని ఫిట్ సెక్రెటరీ మేండే వెంకటి, కౌన్సిలర్ వంగ తిరుపతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కమలాకర్ రావు, మాజీ సర్పంచ్ జక్కుల రాజేశం, రాజేంద్రపాణి, మోతే కనకయ్య, పాణిగంటి సత్తయ్య, వడ్లకొండ రవి, రఫీక్ ఖాన్ పాల్గొన్నారు.

'సింగరేణి యజమాన్య ఏక పక్ష నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం'

నవతెలంగాణ-నస్పూర్

జూన్ రెండవ తేదీన సింగరేణి యాజమాన్యం నిర్వహించే దశాబ్ది ఉత్సవాలలో టీబీజీకేఎస్ నాయకులను మాత్రమే ఉత్సవాలకు ఆహ్వానించడం సరికాదని, సింగరేణి యాజమాన్య ఏకపక్ష నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిప్యూటీ జనరల్ సెక్రటరీలు వీరభద్రయ్య, బాజీ సైదా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీబీజీకేఎస్ పదవీకాలం పూర్తయిన కూడా యాజమాన్యం నిర్వహించే ఉత్సవాలకు అధికారికంగా వారిని ఒక్కరినే ఆహ్వానించడం సరికాదని అన్నారు. అన్ని యూనియన్లను ఆహ్వానించి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఏఐటీయూసీ డిమాండ్ చేస్తుందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో సింగరేణి కార్మికుల పాత్ర కీలకమైందని తెలిపారు. ఉద్యమ సమయంలో గుర్తింపు సంఘంగా ఉన్నటువంటి ఏఐటీయూసీని తెలంగాణ జేఏసీ నాయకత్వం ప్రొఫెసర్ కోదండరాం, ప్రజా గాయకుడు గద్దర్ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీతారామయ్యకి సింగరేణి కార్మికులు సకలజనుల సమ్మెలో పాల్గొనడం ద్వారానే ఈ కేంద్ర ప్రభుత్వం దిగి వస్తుందని భావించి సింగరేణిలో, ఆర్టీసీలో గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటీయూసీ నాయకత్వం సమ్మె నోటీస్ ఇవ్వడం ద్వారానే ఈ సకల జనుల సమ్మె ఇటు సింగరేణిలో, ఆర్టీసీలో రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతం అవుతుందని కోరారని తెలిపారు.

ఓటర్ జాబితా సవరణలో పార్టీల పాత్ర కీలకం

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్
- రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమీక్షా సమావేశం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తుది ఓటర్ జాబితా సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీల పాత్ర కీలకమైనదని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి రెండవ ఓటరు జాబితా సవరణపై వివిధ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ నుండి జూన్ 23వ తేదీ వరకు బీఎల్ఓలు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ నమోదు ప్రక్రియ చేపడతారని తెలిపారు. ఇదే సందర్భంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఓటరు జాబితా తయారీలో ప్రత్యేక పాత్ర పోషించాలన్నారు. పోలింగ్ కేంద్రానికి దూరంగా ఉన్న ఓటర్లను గుర్తించి దగ్గర్లో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో వారి పేరు నమోదు కోసం అవసరమైన దరఖాస్తును సమర్పించేలా రాజకీయ పార్టీ నాయకులు కృషి చేయాలన్నారు. ఓటరు జాబితాలో తప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సెప్టెంబర్ నెలలో రెండు శనివారాలు, రెండు ఆదివారాలు ఓటరు నమోదు ప్రక్రియ కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో పార్టీలో ప్రతినిధులు పూర్తిస్థాయిలో సహకరించి నాణ్యమైన ఓటర్ జాబితా తయారయ్యేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సూపరింటెంట్ ప్రమోద్, ఎలక్షన్ డీటీ జితేందర్, అన్ని పార్టీల ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డులో ఝాన్సీనగర్ నుండి బేడ బుడిగ జంగాల కాలనీ వరకు సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.5 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును మంగళవారం మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు ప్రారంభించారు. అనంతరం పాదయాత్రలో భాగంగా ప్రజలను కలుస్తూ తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలని వివరిస్తూ, జూన్ 9వ తేదీన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు నూతనంగా నిర్మించబడిన కలెక్టరేట్ భవనాన్ని, బీఆర్ఎస్ జిల్లా భవనాన్ని ప్రారంభించడానికి వస్తున్న సందర్భంగా వార్డు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని బహిరంగ సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, పట్టణ అధ్యక్షులు సుబ్బయ్య, పట్టణ స్థానిక 7వ వార్డు కౌన్సిలర్ చీడం మహేష్, కార్యదర్శి మేరుగు పవన్ కుమార్, కౌన్సిలర్లు వంగ తిరుపతి, పూదరి కుమార్, టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ సురేందర్‌రెడ్డి, జక్కుల రాజేశం, 17వ వార్డు అధ్యక్షులు రఫిక్ 12వ వార్డు రవి గౌడ్, శ్రీరాంపూర్ సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ మల్లెత్తుల రాజేంద్రపాని, మంచిర్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కమలాకర్ రావు, సంతోష్‌చారి, వేల్పుల రవి, బౌతు వెంకటేష్, పెరుక సత్తయ్య, బోనాస స్వామి, బండి తిరుపతి, పాముల లక్ష్మి పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో వైద్య సేవలు మెరుగు

- జడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా ఆవిర్భావం తర్వాత జిల్లా కేంద్రంలో రోజురోజుకు వైద్య సేవలు మురుగుపడుతున్నాయని ఇది సంతోషించే దగ్గర విషయమని జడ్పీ చైర్ పర్సన్ కోవలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీనివాస ప్రయివేటు ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జడ్పీటీసీ నాగేశ్వరరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో రోజురోజుకు వైద్య సేవలు పెరుగుతున్నాయని ఇది ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. ఆస్పత్రి నిర్వాహకులు గత కొద్దికాలం నుండి అద్దె భవనంలో కొనసాగుతున్నప్పటికీ అతి తక్కువ ధరలతో వైద్య సేవలు అందిస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇదే విధానాన్ని కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ నాయకుడు నిసార్, అహమ్మద్, హాస్పిటల్ నిర్వాకుడు వైద్యుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలకు విద్యాలర్థుల ఎంపిక

నవతెలంగాణ-జన్నారం

గురుకుల పాఠశాలలో ఎంపిక ఫలితాలలో మండలం నుంచి అత్యధికంగా మంది విద్యార్థులు ఎంపికై జిల్లాలో మొదటిస్థానంలో నిలిచింది. మండలంలోని కలమడుగు వివేకానంద పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులు గురుకులాలకు ఎంపికయి జిల్లాలో మొదటి స్థానంలో నిలువగా, పానకల్ ప్రాథమిక పాఠశాలకు చెందిన 14 మంది విద్యార్థులు గురుకులాలకు ఎంపికయి రెండవ స్థానంలో నిలిచారు. జన్నారం మండలం నుంచే అత్యధిక మంది విద్యార్థులు గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు అర్హత పరీక్ష రాసి ఎంపికైనట్లు మండల విద్యాధికారి విజయకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు. ఉపాధ్యాయులు ఇదే విధమైన ఫలితాలు. అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం జాజల శ్రీనివాస్, వివేకానంద పాఠశాల హెచ్ఎం ఏ.సతీశ్‌గౌడ్‌లను ఎంఈఓ విజయ్ కుమార్, సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్ లు అభినందించారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలంగాణ దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 31 మే 2023

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉపాధి హామీ కూలీలకు సంబంధించిన డబ్బులను బ్యాంకులు రుణం కింద జమచేసుకోవడం సమంజసం కాదని బీజేపీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మాంగ్లి గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీ డబ్బులు బ్యాంక్ అధికారులు రుణం కింద జమచేసుకుంటున్నారని బాధితులు సుహాసినిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంగళవారం ఆమె ఆదిలాబాద్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయానికి వెళ్లి సీనియర్ మేనేజర్ వినోద్ కుమార్‌ని కలిసి కూలీల సమస్యను వివరించారు. దీంతో ఉపాధి కూలీల సమస్యలను పరిష్కారం అయ్యేలా చేస్తామని బ్యాంక్ అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

రైతులు అధైర్యపడొద్దు : పీఏసీఎస్ ఛైర్మన్ గుండు తిరుపతి

నవతెలంగాణ-భీమారం

అకాల వర్షాలతో ఇబ్బందులు పడుతున్న రైతులు అధైర్యపడొద్దని పీఏసీఎస్ చైర్మన్ భరోసా కల్పించారు. సోమవారం రాత్రి మండలంలో కుసిన వర్షానికి రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన వరి ధాన్యం తడిసింది. దీంతో మండలంలోని ఆరెపల్లి, మద్దికల్, కొత్తపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం మార్కెట్ కమిటీ డైరెక్టర్లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లారీల కొరత, మిల్లర్ల వద్ద నెలకొన్న సమస్యలతో తూకాలు ఆలస్యం అవుతోందన్నారు. అయినప్పటికీ తడిసిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అనపర్తి తిరుపతి, పెద్దల బాపు, భుక్య లక్ష్మణ్, ఆత్కూరి రాము, రైతులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా అంతర్గత రహదారులు



నవతెలంగాణ-మందమర్రి

పట్టణంలోని రహదారులన్నీ అస్తవ్యస్తంగా మారాయి. అంతంత మాత్రంగా ఉన్న రోడ్లని కాస్త పైపుల మరమ్మతులని, కొత్త పైప్ లైన్ల కనెక్షన్లని, కరెంటు కోసం, ఇంటర్నెట్ కేబుళ్ల కోసమని ఇష్టానురీతిగా తవ్వేశారు. వాళ్ల పని అయిపోయాక మాకేం సంబంధం లేదన్నట్టు తూతూ మంత్రంగా గుంతలను మట్టి వేసి పూడ్చేస్తున్నారు. నిరంతరం వాహనాలు ప్రయాణించడం వలన అవి కుంగిపోయి ద్విచక్ర వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదురుకొంటున్నారు. మంగళవారం ఉదయం పడిన చిన్నపాటి వర్షానికే పట్టణ నడిబొడ్డున ఉన్నటువంటి బస్టాండ్ ఎదురుగా రోడ్డులో కారు దిగబడటంతో చేసేదేమి లేక కారు యజమాని వాహనాన్ని అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కండ్లు తెరిచి ఏదో చేస్తున్నాం. అన్నట్టు కాకుండా పక్కా ప్రణాళికతో పట్టణాన్ని ఆధునికరించాలని వాహనదారులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

గరంగరంగా మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ అమృత్ రావ్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం గరం గరంగా కొనసాగింది. ముందుగా మండల ఇన్‌ఛార్జి వ్యవసాయ అధికారి జాదవ్ కైలాస్ తన నివేదికను చదివి వినిపించారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, విత్తనాలను కొనుగోలు చేసినప్పుడు రశీదును తప్పక తీసుకోవాలని సూచించారు. మండలంలోని ఆయా గ్రామాలో నూతన రేషన్ డీలర్ పోస్టులను అర్హులకు కాకుండా, సరైన విచారణ జరపకుండానే ఇతరులకు కేటాయించారని రిమ్మ సర్పంచ్ పెందూర్ అనిల్ కుమార్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ కూలీలు పని చేసి రెండు సంవత్సారాలు గడిచిన ఇప్పటి వరకు వారికి డబ్బులు జమ కాలేదని అన్నారు. ఆ డబ్బులు ఎటు వెళ్లాయని వైస్ ఎంపీపీ సాగర్‌బాయి ఉపాధి హామీ ఏపీఓను ప్రశ్నించారు. మండలంలో అధిక శాతం గిరిజనులే ఉన్నారని పిల్లలకు, గర్భిణీలకు సరైన పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌ను సర్పంచ్‌లు కోరారు. ఉన్నతాధికారులు హాజరు కాకుండా కింది స్థాయి అధికారులు హాజరు కావడంతో ఎంపీపీ అమృత్ రావ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్, ఎంపీఓ అతుల్ కుమార్, ఎంఈఓ రాథోడ్ ఉదయ్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ శంకర్ నాయక్ పాల్గొన్నారు.

దేశీదారు పట్టివేత



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని ప్రధాన రహదారి గాంధారి మైసమ్మ ఆలయ సమీపంలో కారులో దేశీదారు రవాణా చేస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్టు టాస్క్ ఫోర్స్ సీఐ సుధాకర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర నుంచి కాగజ్‌నగర్‌కు దేశీదారు రవాణా చేస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం సిబ్బందితో కలిసి తనిఖీ చేయగా మహారాష్ట్రకు చెందిన రెండు కార్లు (ఎంహెచ్ 04బీడబ్ల్యూ611) (ఎంహెచ్ 49బీబీ5818) ఫుల్‌గా బ్లాక్ గ్లాస్ కవర్ వేసుకొని కాగజ్‌నగర్ వైపు వస్తుండగా తనిఖీ చేశారు. అందులో సుమారు 30 కాటన్ల 90 ఎంఎల్ దేశీదారు బాటిల్స్ లభ్యమయ్యాయి. వాటి విలువ సుమారు రూ.లక్షా 5వేలు ఉంటుందని, మార్కెట్లో సుమారు రూ. లక్షా 80వేలు ఉంటుందని తెలిపారు. వాహనాల్లో ఉన్న నలుగురు వ్యక్తులను విచారించగా మహారాష్ట్రలోని బల్లార్ష వాసులుగా తెలిపారని, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదగించాలనే దురాశతో జిల్లాలోని వివిధ గ్రామాల్లో అమ్మకానికి వచ్చినట్టు తెలిపారన్నారు. నలుగురు నిందితులను, దేశీదారు, రెండు కార్లను కాగజ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ సీఐ సుధాకర్, ఎస్సై సందీప్ కుమార్, రూరల్ ఎస్సై సోనియా, పీసీలు మధు, రమేష్, సంజీవ్, శ్రీను పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలపై కన్నేసిన సర్పంచ్



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని డబ్బా గ్రామ పంచాయితీ పారిశుధ్య కార్మికుల వేతనాలపై సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ కాజేశారంటూ మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయం ముందు బైఠాయించి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మిక, పరిశుధ్య సిబ్బంది వారు మాట్లాడుతూ డబ్బా సర్పంచ్ తాహీరబేగం ఈ నెలలో పరిశుధ్య కార్మికులు కొన్ని రోజులు విధులకు హాజరు కావడం లేదని వేతనాల నుంచి, పనిచేయని దినాలను చూసి వేతనాలను కోత విధించారని అన్నారు. మేము నెల అంతా పనిచేసిన కూడా పనిచేయకుండా ఉన్నారని, మాపై లేనిపోని నిందలు వేసి వేతనం నుంచి కోత విధించడం ఏంటని ప్రశ్నించారు. నెలనెల సరిగా వేతనాలు ఇవ్వడం లేదని అన్నారు. తమకు న్యాయం కావాలని ధర్నా నిర్వహిస్తుమని అన్నారు. సంబంధిత అధికారులు పూర్తి దర్యాప్తు చేసి, కాజేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు

కార్యదర్శిని వివరణ కోరగా..

డబ్బా గ్రామపంచాయతీకి తాను రాకముందు చేసిన విషయాలు తనకు తెలియదని వివరణ ఇస్తూ, గ్రామపంచాయతీ సిబ్బంది ఐదుగురికి బదులు పదిమందిని ఒప్పందాల ద్వారా పనులలో తీసుకొని మల్టీపర్పస్ చేయించుకున్నట్లు తెలిపారు. అగ్రిమెంట్ ఒప్పంద పత్రాలు ఏమైన ఉన్నాయని అడుగగా అటువంటివి నా దగ్గర పత్రం లేవని తెలిపారు. దీనిపై తనకు ఎటువంటి సంబంధం లేదని అన్నారు.

కార్మికులు ఐక్యంగా పోరాటాలు చేయాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక నిర్ణయాలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాటాలు చేసి మన హక్కులను సాధించుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు వెలిశాల కృష్ణమాచారి అన్నారు. మంగళవారం సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐకేపీ వీఓఏ ఉద్యోగుల నిరవధిక సమ్మె శిబిరం వద్ద సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సీఐటీయూ నిరంతరం కార్మికుల పక్షాన పోరాడే ఏకైక సంస్థ కేవలం ఒక కార్మిక సంఘానికే ఘనత దక్కుతుందన్నారు. ఆవిర్భావ దినోత్సవ సంబరాలను నిర్వహించుకోవడం మన బాధ్యతని సీఐటీయూ 1970 సంవత్సరంలో ఆవిర్భవించి నాటి నుండి నేటి వరకు కార్మికుల వెన్నంటి ఉండి వారి న్యాయమైన హక్కుల పరిరక్షణ కొరకు రాజీలేని పోరాటాలు చేయడ జరుగుతుందని అన్నారు. రాబోయే రోజుల్లో కార్మికుల కనీస వేతనాల అమలుకోసం సీఐటీయూ పోరాడుతుందని, అదేవిధంగా మతోన్మాదానికి వ్యతిరేకంగా కార్మికులను చైతన్యవంతం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కోకన్వీనర్ ఉమాదేవి, నాయకులు అర్చన, జీజాబాయి, మంగళ, శివాని, నిర్మళ, సాయి, అంబావతి, వెన్నెల, స్వప్న పద్మ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని కాగజ్‌నగర్ పట్టణంలోని కార్యాలయంలో మంగళవారం జెండాను ఆవిష్కరించారు. సీనియర్ నాయకులు అంగల శ్రీనివాస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు ముంజం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ 1970, మే 30న సీఐటీయూ ఆవిర్భవించిందని అన్నారు. ఆనాటి నుండి నేటి వరకు కార్మికుల పక్షాన పోరాడుతూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ్, సుధాకర్, రవి, నితీష్ పాల్గొన్నారు.



రెబ్బెన : సింగరేణి కార్మికుల ఆధ్వర్యంలో..

రెబ్బెన : సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవ సంబరాలను మంగళవారం గోలేటిలో ఘనంగా నిర్వహించారు. జెండా ఎగరవేసి, కేక్ కట్ చేసి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఓదెలు మాట్లాడుతూ 1970, మే 30న సీఐటీయూ ఆవిర్భవించిందన్నారు. 53 సంవత్సరాలుగా కార్మికుల వెన్నంటే ఉంటూ వారి న్యాయమైన హక్కుల కోసం పనిచేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ కార్మికుల పక్షాన పోరాటడుతోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గతంలో కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాసి పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సిద్దెంకి సత్తయ్య, నాయకులు చంద్రశేఖర్, చిన్నుబాయి, శారద, లక్ష్మీ, ప్రవీణ్, విజయ్ పాల్గొన్నారు.

రెబ్బెన గ్రామ పంచాయతీ కార్యాలయంలో..

రెబ్బెన గ్రామ పంచాయతీ కార్యాలయంలో సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీఐటీయూ జెండాను సంఘం అధ్యక్షుడు రాచకొండ రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఓదెలు మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ ప్రధాన కార్యదర్శి దేవాజీ, సీఐటీయూ నాయకులు సిద్దెంటి సత్తయ్య, లోకేష్, శంకర్, నర్సయ్య, ప్రవీణ్, శేఖర్, రాజేశ్వరి, శోభ, అమృత పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో...



రెబ్బెన : రెబ్బెన గ్రామ పంచాయతీ కార్యాలయంలో..

పేదల పెన్నిధి సీఎం కేసీఆర్ : అల్లోల

నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ రాష్ట్ర పేదల పెన్నిధి సీఎం కేసీఆర్ అని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం నిర్మల్ మంత్రి క్యాంపు కార్యాలయంలో వైద్యశాఖలో కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న వైద్య, ఆరోగ్య కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వం ఇటీవలే క్రమబద్ధీకరణ చేసిన సందర్భంగా వారు మంత్రిని కలిసి ధన్యవాదాలు తెలిపి, శాలువాతో సన్మానించారు. అనంతరం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. నిరుపేదల పెన్నిధి సీఎం కేసీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని తెలంగాణ ఉద్యమ సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న మహోన్నత వ్యక్తి కేసీఆర్ అని కొనియాడారు. మరోవైపు గతంలో ఏ ప్రభుత్వం కూడా చేయలేని పనులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని అన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో ఉన్న ప్రజల కోసం 33 జిల్లాలో కోర్టులను కూడా ఏర్పాటు చేశారని అన్నారు. గతంలో ఎక్కడో కేసు అయితే సుమారు 100 కిలోమీటర్ల దూరంలో కోర్టులు ఉండేవని, ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదని, ఏ జిల్లాకు ఆ కోర్టును మంజూరు చేయడం జరిగిందని అన్నారు. నిర్మల్‌కు మెడికల్ కాలేజీ వచ్చిందని, నర్సింగ్ కాలేజ్ కూడా రాబోతుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.



3న రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 3న నిర్వహించే రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్పేయి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావుతో కలిసి అన్ని మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్‌లతో వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 3వ తేదీన నిర్వహించే రైతు దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించాలని అన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 70 రైతు వేదికల్లో కార్యక్రమాలు నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఆయా రైతు వేదికల పరిధిలోని కనీసం వెయ్యి మంది రైతులు వచ్చేలా చూడాలని అన్నారు. రైతులతో ర్యాలీలు నిర్వహించాలని అన్నారు. రైతుబంధు ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు చేసిన సంక్షేమం గురించి అధికారులు మాట్లాడటంతో పాటు రైతులతో తమ అభిప్రాయాలు చెప్పించాలని అన్నారు. దశాబ్ది ఉత్సవాలను ఆది నుండి ముగింపు వరకు విజయవంతం చేయడంలో ప్రతి అధికారి కృషి చేయాలని సూచించారు. ఈ కాలక్రమంలో డీఆర్డిఓ సురేందర్ పాల్గొన్నారు.

బొగ్గుగని కార్మికులను నట్టేట ముంచిన జాతీయ సంఘాలు

నవతెలంగాణ - రెబ్బెన

సింగరేణి కార్మికులకు 2021 సంవత్సరంలో అమలు కావాల్సిన వేతన ఒప్పందాన్ని రెండు సంవత్సరాలు ఆలస్యంగా ఒప్పందం చేసుకోవడంతో పాటు ఒప్పందంలో ఎలాంటి పెరుగుదల లేకుండా చేసుకొని సింగరేణి కార్మికులను జాతీయ సంఘాలైన ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్ నట్టేట ముంచాయని టీబీజీకేయస్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు ఆరోపించారు. బెల్లంపల్లి ఏరియా గోలేటి సీహెచ్‌పీలో మంగళవారం ఫిట్ సెక్రటరీ మెరుగు రమేష్ అధ్యక్షతన జరిగిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. 11వ వేజ్‌బోర్డులో జాతీయ సంఘాలు ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్ తప్పుడు ఒప్పందాలు చేసుకున్నాయన్నారు. పైగా కార్మికులను మభ్యపెట్టే విధంగా మాట్లాడుతున్నారని తెలిపారు. కార్మికులను ఇంటి అద్దె పెంచలేదని, ఇంక్రిమెంట్ రేటు పెరగలేదని తెలిపారు. అలవెన్సులను రెండు సంవత్సరాలు దాటిన తర్వాత ఒప్పందం చేసుకొని కార్మికులకు అన్యాయం చేయడమే కాకుండా 25 శాతం పెంచామని గొప్పలు చెప్పుకుంటున్నారని పేర్కొన్నారు. అలవెన్సులను పాత బేస్ నుండి కాకుండా జూన్ 2023 నెల నుండి చెల్లించే విధంగా ఒప్పందం చేసుకోవడం కార్మికులకు నష్టదాయకమన్నారు. కార్మికులు విహారయాత్రకు వెళ్లే ఎల్‌టీసీలను కూడా అతితక్కువ పెంచి కార్మికులకు నష్టం చేశారని, గృహరుణం గురించి ఊసెత్తలేదన్నారు. కాంట్రాక్టు కార్మికులకు ఏ ఒక్క లాభదాయక ఒప్పందం చేసుకోలేదని, కార్మికులందరు జాతీయ సంఘాలు చేసే అవాస్తవ ప్రచారాన్ని అడ్డుకోవాలని, వాస్తవాన్ని గ్రహించాలని కోరారు. కార్యక్రమంలో సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్ ప్రకాష్‌రావు, సెంట్రల్ కమిటీ సభ్యులు గెల్లి రాయలింగు, టీబీజీకేయస్ మాజీ ఉపాధ్యక్షుడు నలగొండ సదాశివ్, ఏరియా నాయకులు వీరస్వామి, అలవేని సంపత్, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శులు రవికుమార్, సత్యనారాయణ, సురేష్‌కోరి, మాటూరి అర్జయ్య, మల్రి సమ్మయ్య, అబ్దుల్‌సమీ, టీబీజీకేయస్ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, మహిళా కార్మికులు పాల్గొన్నారు.



ఆశా వర్కర్లకు పరీక్ష రద్దు చేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆశా వర్కర్లకు నిర్వహించ తలపెట్టిన పరీక్షను ప్రభుత్వం రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరు లోకేష్ డిమాండ్ చేశారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన పరీక్షను రద్దు చేయాలన్నారు. పెరుగుతున్న ధరల కనుగుణంగా ఆశలకు ఇస్తున్న వేతనాన్ని 18 వేలకు పెంచాలన్నారు. ప్రతి నెల రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించాలన్నారు. పారితోషికం లేని అదనపు పనులు చేయించకూడదన్నారు. టీబి, లెప్రసీ, కంటి వెలుగు పనులు డబ్బులు వెంటనే మంజూరు చేయాలని అన్నారు. పీఆర్సీ ఏరియర్స్ విడుదల చేయాలన్నారు. వెంటనే ఆశల డిమాండ్లు పరిష్కరించాని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు స్వరూప, నాయకులు లావణ్య అమృత పాల్గొన్నారు.

ప్రయివేటు ఏజెన్సీలాగా పోలీసుల పాత్ర

- బీజేపీ నాయకుల గృహ నిర్బంధం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రేణుక సిమెంట్ ఉచ్చులో పడి దగాపడ్డ రైతులకు మద్దతుగా బీజేపీ ఉంటుందని బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్ అన్నారు. మంగళవారం బీజేపీ నాయకుల అరెస్టులు గృహ నిర్బంధాలు కొనసాగుతున్నాయని అయినా భయపడకుండా అధికార పార్టీ చర్యలకు ఎదురు నిలబడి పోరాటం చేస్తూనే ఉందన్నారు. ఈ వ్యవహారంలో పోలీసుల పాత్ర ఒక ప్రయివేటు ఏజెన్సీల ఉందన్నారు. మంగళవారం ఆ భూములను దున్నటానికి ట్రాక్టర్లతో బీజేపీ కార్యకర్తలు రైతులు పాయల్ శంకర్ నివాసం నుండి బయలుదేరగా పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేసి గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న రేణుక సిమెంట్స్ పేరుతో రైతులను మోసం చేశారని, వారికి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు వారి పిల్లలకు ఉద్యోగాలు అంటూ ఆశ చూపి వారి వద్ద నుండి లక్షల విలువైన భూములను అతి తక్కువకు కొనుగోలు చేశారని అన్నారు. మూడేళ్ల కాలంలో నిర్మాణం పూర్తి చేసి వారి పిల్లలకు ఉద్యోగాలు కల్పిస్తామని మాయమాటలు చెప్పారు. కానీ ఏడేండ్లు అవుతున్న ఇప్పటివరకు కనీసం శంకుస్థాపన కూడా చేయకుండా వారిని మోసం చేస్తూనే ఉన్నారని అన్నారు. ఆ భూములను దున్ని వ్యవసాయ యోగ్యంగా మార్చుకోవడానికి నడుం బిగించారని అన్నారు. వారికి మద్దతు తెలుపుతున్న బీజేపీ నాయకులను కార్యకర్తలను గృహ నిర్బంధం చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కుంచెట్టి సంతోష్, దయాకర్, రఘుపతి, లింగు పాటిల్, స్వామి, ఆకుల ప్రవీణ్, దినేష్ మాటోలియా, వేదవ్యాస్, చిలుకూరి జ్యోతిరెడ్డి, నగేష్‌రెడ్డి, శివ, శ్రీనివాస్, బాధిత రైతులు సందీప్, హరి కేశవ్ పాల్గొన్నారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీతకు చేయూత




నవతెలంగాణ-ఆసిఫాబాద్

పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజుకు అన్ని రకాల చేయూత అందిస్తామని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కును, తనను కలిసిన పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజుతో ముచ్చటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఆయన మాట్లాడుతూ అవార్డు గ్రహీతకు గతంలో ఇచ్చిన అన్ని రకాల చేయూత అందించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో నివాస స్థలం కేటాయించడం జరుగుతుందని జైనూర్‌లో వ్యవసాయ భూమిని అందిస్తామని అన్నారు. అలాగే ఇతర అభివృద్ధి పనులను కూడా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గర్భిణి పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్‌లో ప్రసవం చేశారు. మంగళవారం లక్ష్మీపూర్‌కు చెందిన ఆత్రం రాంబాయికి పురిటినొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. గర్భంలో కవల పిల్లలు ఉన్నట్లు రిపోర్ట్‌లో ఉండటంతో అక్కడ చేరుకున్న 108 సిబ్బంది. అంబులెన్స్ ఎక్కించుకొని మంచిర్యాల మాతా శిశుకేంద్రానికి తరలించే క్రమంలో మార్గ మధ్యలో మందమర్రి చేరుకోగా ఆమెకు పురటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అంబులెన్స్‌లోనే నార్మల్ డెలవరీ చేశారు. కడుపులో ఉన్న కవలల్లో ఒక శిశువు జన్మించగా, రెండో శిశువుకు సమయం పడుతుందని నిర్ధారించి వెంటనే తల్లీ బిడ్డలను మంచిర్యాల మాతా శిశు కేంద్రానికి తరలించినట్లు కాసిపేట 108 ఈఎంటీ డి.ఆత్మారావు, పైలెట్ ఏ తిరుపతిలు తెలిపారు.